విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

216 జాతీయ రహదారిపై ప్రమాదాలకు పోలీసులదే బాధ్యత

- పోలీసులను హెచ్చరించిన కలెక్టర్ రాజాబాబు

విశాలాంధ్ర-కృత్తివెన్ను : 216 జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగితే పోలీసులే బాధ్యత వహించాల్సి వస్తుందని కలెక్టర్ రాజబాబు పోలీసులను హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ జగనన్నకు చెబుద్దాం కార్యక్రమం కోసం 216 జాతీయ రహదారిపై ప్రయాణించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి ఆనుకుని ఆక్రమణలు గురవ్వడాన్ని కలెక్టర్ స్వయంగా గుర్తించారు. దీంతో పోలీసులు పిలిచి ఆగ్రహం వ్యక్తంచేశారు. జాతీయ రహదారి పక్కనే బడ్డీకొట్లు, టీ కొట్లు ఏర్పాటు చేస్తుంటే ప్రమాదాలు జరగవా అని పోలీసులను ప్రశ్నించారు. జాతీయ రహదారిపై వెళ్లే వాహన చోదకులు ఎదురుగుండా ఏముందో గుర్తించలేకపోవడంవల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. టీ కొట్లు, బడ్డీ కొట్లు వద్ద మోటార్ సైకిల్ రోడ్డుపై ఆపి ఉంటే దూరంగా ఏముందో వాహన చోదకులకు ఎలా తెలుస్తుందని పోలీసులను ప్రశ్నించారు. కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల పరిధిలో జాతీయ రహదారి ఆక్రమణలు తక్షణం తొలగించాలని పోలీసులను ఆదేశించారు. ఈ ఆక్రమణలు మూలంగా జరిగే ప్రమాదాలకు పోలీసులే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగన్ : వంశీ

విశాలాంధ్ర-గన్నవరం : సంక్షేమం అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ అన్నారు. గన్నవరం దావాజిగూడెంలో శుక్రవారం కోటి రూపాయలతో వివిధ సీసీ రోడ్లుకు శంకుస్థాన చేశారు. గౌడ్‌పేటలో రూ.8 లక్షలతో తోడేపడు చెరువురోడ్డు, ఎంహెచ్-5 నుండి నవోదయ కోచింగ్‌సెంటర్‌కు రూ.22 లక్షలు, బుద్దవారంలో సబ్బారావునగర్ నుండి రాజీవ్ కాలనీ రోడ్డుకు రూ.40 లక్షలు దావాజిగుడెం పామర్తినగర్ చర్చి నుండి షేక్ నూర్జహాన్ ఇంటి వరకు రూ.6 లక్షలు, గన్నవరంలోని పుట్టగుంట రోడ్డులకు రూ.35 లక్షలతో శంకుస్థాన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనగాని రవి, వైస్ ఎంపీపీ శివనాగ రాజకుమారి, జెడ్పీటీసీ సభ్యులు అన్నవరపు ఎలిజబెత్ రాణి, మాజీ సర్పంచి నీలం బాలు,గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు, పడమట సురేష్, చిమాట శ్రీనివాసరావు, కూరేటి వార్డు సభ్యులు పడమట నాగరాజు, లుక్కా ప్రసాద్, చిమాట శ్రీనివాసరావు, జలసూత్రం రాం మోహనరావు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృత్తివెన్ను ఎంపీపీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-కృత్తివెన్ను : మండల పరిషత్ అధ్యక్షుడు కూనసాని గరుడ ప్రసాద్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఎంపీపీ జన్మదిన పురస్కరించుకుని సీతనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. సీతనపల్లి వద్ద వద్ద కేక్ కట్ చేసి ఎంపీపీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపిశెట్టి చిన్నా, గుగ్గిళ్ళ జయరాజు, గోపిశెట్టి వీరాస్వామి, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో కవి సమ్మేళనం

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని 56వ జాతీయ గ్రంథా లయ వారోత్సవాలలో భాగంగా యలమర్రు, పెదపారుపూడి గ్రంథాలయాల్లో కవి సమ్మేళనం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి విస్తరణ అధికారి వంగ శ్రీనివాస్ (వంశీ) ముఖ్యఅతిథిగా శుక్రవారం పాల్గొన్నారు. ఈ విషయమై వంశీ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండి గ్రంథాలయంను తీరిక సమయంలో సందర్శించి పుస్తక పఠనం చేస్తే వారి భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. అలాగే ప్రతి ఒక్కరు విద్యార్థి దశలోనే మాతృభాష పట్ల మమకారం పెంచుకోవాలని మాతృభాషలో పట్టు సాధిస్తే అన్యభాషలను అభ్యసించటం తేలికని విద్యార్థులకు సూచించారు. ఈ పోటీ ప్రపంచంలో జయించాలంటే జ్ఞానం ఒకటే మార్గమని అది గ్రంథాలయంలో దొరుకుతుందని వంశీ వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు పి రవిచంద్ర, ఎంవిఎస్ లక్ష్మి, హెచ్‌ఎం భవాని, తదితరులు పాల్గొన్నారు.

ఇన్వర్టర్ బహుకరణ

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని యలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావెళ్ల వరుణ కుమార్ తన సొంత నిధులు రూ 20,000లు వెచ్చించి ఇన్వర్టర్ ను మండల విద్యాశాఖ కార్యాలయానికి బహుకరణగా అందించినట్లు ఎంఈఓ 1 బి శ్రీనివాస్, ఎంఈఓ 2 వి సురేష్ లు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ విషయమై ఎంఈఓ కార్యాలయ సిబ్బంది తదితరులు వరుణ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల 'పుస్తక పఠనం'

విశాలాంధ్ర-కూచిపూడి : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠంలో గల శ్రీ బాలా త్రిపుర సుందరి గ్రంథాలయంలో పుస్తక పఠనం కొనసాగింది. శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్ విద్యార్థులు పుస్తకాలు చదివే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నెమ్మాని శేష సాయి కుమార్ ప్రారంభించి విద్యార్థినులకు గ్రంథాలయాల వలనలభించేఉపయోగాలు పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకులు ఏలేశ్వరపు వెంకటేశ్వరఫణికుమార్, పాఠశాల రాత్రి కాపలాదారుడు మహంకాళి సత్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మొవ్వ తృతీయ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వి ఎస్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు'ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా యుద్ధ నివారణమార్గాలు'అంశంపై గ్రంథాలయ పాలకురాలు తూములూరి కృష్ణకుమారి వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

జర్నలిస్ట్ చంద్ర కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-అవనిగడ్డ : జర్నలిస్ట్ చంద్ర కుటుంబానికి పలువురు దాతలు స్పందిస్తూ ఆర్థిక సహాయం అందచేశారు. ఇటీవల సీటి కేబుల్ జర్నలిస్ట్ కళ్ళేపల్లి చంద్ర ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందిన విషయం విధితమే. అవనిగడ్డ ప్రెస్ క్లబ్ కార్యదర్శి పుట్టి శ్రీనివాసరావుకు శుక్రవారం సీనియర్ న్యాయవాది టిడిపి నాయకులు బండే శేషగిరిరావు తన వంతు సాయంగా 5 వేల రూపాయలు, ఎక్సైజ్ (ఎస్.ఇ.బి) సిఐ జి నూకరాజు రూ.4 వేలను అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు కోట సుబ్బారావు, అల్లపర్తి గోపాలకృష్ణ, చందు శ్రీనివాసరావు, మునేశ్వరరావు, సింహాద్రి జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ 30 గంటల నిరసన దీక్షను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-మచిలీపట్నం : కృష్ణా జలాల పునః పంపిణీపై గెజిట్ నోటిఫికేషన్ రద్దు కోరుతూ ఆంధ్రప్రదేశ్ భవిత కోసం కరువు నివారణ సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో చేపట్టనున్న 30 గంటల నిరసన దీక్షను జయప్రదం చేయాలని సీపీఐ మచిలీపట్నం నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాయలంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నిరసన దీక్ష వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫిలిప్ మాట్లాడుతూ ఈ నెల 20 21 తేదీలలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఈ దీక్ష జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తం 440 మండలాల్లో కరువు తావిస్తుంటే ప్రభుత్వం కేవలం 103 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకుందని విమర్శించారు. సమగ్ర సర్వే చేయించి కేంద్రానికి నివేదించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. తరతరాల చరిత్ర కలిగిన కృష్ణాజిల్లాలో నేడు తగినంత నీటి సరఫరా లేక ప్రజలు కరువుతో విలవిలలాడుతూ వలసలు పోతున్నారని తెలిపారు. వలసల నివారణకు తక్షణం ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో కరువు బారిన పడకుండా ఉండేందుకు నికర జలాల సాధనే లక్ష్యంగా భావితరాల భవిష్యత్తుకై చేయి చేయి కలుపుదాం, నీటిని సాధించుకుందాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ఒంటి పులి లక్ష్మణరావు, సిపిఐ నాయకులు మోదుమూడి నాగరాజు, సయ్యద్ మౌలా, బక్షు, తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంలో పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-గన్నవరం : భారత కమ్యూనిస్టు పార్టీ చేపట్టిన 30 గంటల దీక్ష జయప్రదం చేయండని సీపీఐ గన్నవరం నియోజకవర్గ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు కోరారు. గన్నవరం సీపీఐ కార్యాలయంలో 30 గంటలదీక్ష వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాల పునర్వ పంపిణీపై గెజిట్ నోటిఫికేషన్ రద్దు కోరుతూ, కరువు మండలాలు గుర్తించి, కరువు సహాయ చర్యలు చేపట్టాలని, ఆంధ్రప్రదేశ్ భవిషత్ కోసం ఈ నెల 20, 21వ తేదీల్లో విజయవాడలో జరిగే 30 గంటల నిరసన దీక్ష జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షులు పెద్దు వెంకటరత్నం, రైతు సంఘం నాయకులు ముక్కమాల ఉమామహేశ్వరావు, సీపీఐ పట్టణకార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి, కార్యవర్గ సభ్యులు కట్టవరపు విజయరావు, బండారు లక్ష్మయ్య, చాంగంటిపాటి వెంకటేశ్వరరావు, సభ్యులు శంకరరావు, రేమల్లి రాజేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్య పరిష్కారమే 'జగనన్నకు చెబుదాం' లక్ష్యం

విశాలాంధ్ర-బంటుమిల్లి :- ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం లక్ష్యమని కృష్ణాజిల్లా కలెక్టర్ పి రాజాబాబు పేర్కొన్నారు.జగనన్నకు చెబుదాం మండల స్థాయి ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం శుక్రవారం స్థానిక టీటిడి కళ్యాణ మండపంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులతో కలిసి నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కొరకు ప్రజలు కలెక్టరేట్ వరకు రాకుండా మండలంలోనే అధికారులతో కలిసి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ మేరకు జిల్లాలో ప్రతి బుధ, శుక్రవారాలలో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈరోజు బంటుమిల్లిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మండలంలో పెందుర్రు తదితర గ్రామాల్లో నివసిస్తున్న ఎస్టీ కుటుంబాలకు జనన ధ్రువపత్రాలు, ఆధార్ కార్డులు, రైస్ కార్డులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జాబ్ కార్డులు మంజూరు చేసి వారికి పని కల్పించాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డ్వామా, గృహ నిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. వారి పిల్లలను సమీపంలోని అంగన్వాడి కేంద్రాలలో చేర్పించి మంచి చదువు చెప్పించాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారిని ఆదేశించారు. కలెక్టర్ విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు, విద్యుత్ ఆదాకు చిట్కాలపై సిపిడిసిఎల్ ముద్రించిన గోడపత్రికలను జాయింట్ కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బందర్ ఆర్డీవో ఎం.వాణి, జిల్లా అధికారులు డ్వామా పిడి జీవి సూర్యనారాయణ, డి ఆర్ డి ఏ పిడి పిఎస్ఆర్ ప్రసాద్,డీఎస్ఓ పార్వతి, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ జి గీతాబాయి, విద్యుత్ శాఖ ఈఈ భాస్కరరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఫణి ధూర్జటి, డి వై ఈవో యువి సుబ్బారావు, తదతరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

జిల్లా వైద్యాధికారి గీతాబాయి

విశాలాంధ్ర-బంటుమిల్లి :- గ్రామీణప్రాంతాలలోని ప్రజల ఆరోగ్య స్థితి గతులను ఎప్పటికపుడు పరిశీలించి వారికి వైద్య సదుపాయాలను కల్పించాలని కృష్ణాజిల్లా వైద్యధికారి వైద్య సిబ్బందికి సుచించారు .బంటుమిల్లి ప్రాథమిక ఆరోగ్యకేందాన్ని శుక్రవారం జిల్లావైద్యాధికారి గీతాబాయి పరిశిలించి ప్రజారోగ్య సమస్యలను పి హెచ్ సి విద్యాధికారి పవన్ కుమారును అడిగి తెలుసుకున్నారు .ఈ సందర్బంగ గీతాబాయి మాట్లడుతూ గ్రామాలలోని మినీ ఆరోగ్యకేంద్రాలలో విదులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎప్పటికప్పుడు వారి పరిథిలో ఉన్న ప్రజల ఆరోగ్య పరిస్థితులను సర్వే ద్వారా తెలుసుకుని అవసరమైన వారికి తగు వైద్యాన్ని అందించాలన్నారు. గ్రామాలలో మినీ ఆరోగ్యకేంద్రాలలో మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం అసుపత్రి పరిసరాలను, వైద్యసిబ్బంది పనితీరును, రికార్డులను పరిశిలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గోన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పండు ఎంపిక

విశాలాంధ్ర-పెడన : పెడన పట్టణం తోటమూల బట్ట మోహనరావు - హైమావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి లో జరిగిన రగ్బీ అండర్ 17 పోటీల్లో 9వ తరగతి విద్యార్థి బొడ్డు పండు రాష్ట్రస్థాయి పోటీల్లో కృష్ణా జిల్లా జట్టుకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు జి నరసింహారావు తెలిపారు. ఈ పోటీలు ఈనెల 20వ తేదీన కర్నూలు జిల్లాలో జరుగుతాయని అన్నారు. ఇంతటి ప్రతిభ కనబరిచిన పండుని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చింతలపాటి నాగేశ్వరరావు అబ్దుల్ అమీన్ ఇతర ఉపాధ్యాయులు అభినందించారు

రూ.2.55 కోట్లతో 'జలజీవన్ మిషన్'



విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రూ.2.55 కోట్లతో నిర్మించిన జలజీవన్ మిషన్ ద్వారా సరఫరా అవుతున్న ఇంటింటికి కుళాయి పని తీరితెన్నులను న్యూఢిల్లీలోని కేంద్ర సచివాలయ అసిస్టెంట్ ఆఫీసర్స్ బృందం శుక్రవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. నీటి సరఫరా పై లబ్దిదారుల నుంచి కూడా వివరాలు సేకరించారు. న్యూఢిల్లీ నుంచి విచ్చేసిన శ్రిష్టిభాటియా, వంశిక.ఠాగూర్, శుభం చౌహాన్, శివంకుమార్ భరద్వాజ్, సాగర్ రావత్ బృందం మండల ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కె ఎస్ ఆర్ ప్రసాద్ ద్వారా దీనికి సంబంధించిన వివరాలను సేకరించి నివేదికను రూపొందించుకున్నారు. అదేవిధంగా మొవ్వ పంచాయతీ కార్యాలయాన్ని - (1వసచివాలయం), జగనన్నకాలనీలో నిర్మించిన గృహాలను, శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని, లెక్కల ల్యాబ్.ను, పిల్లలు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాన్ని, పాఠశాల పనితీరును పరిశీలించి ప్రధానోపాధ్యాయులు సబ్బినేని సాంబశివరావు ద్వారా పాఠశాల వివరాలను సేకరించారు. అలాగే లెక్కల ఉపాధ్యాయురాలు మేకా రాణి పర్యవేక్షణలో విద్యార్థిని విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిషన్ పరిశీలించి రాష్ట్ర, జాతీయ స్థాయిలకు వెళ్లిన ఎగ్జిబిట్స్ తిలకించి సంతృప్తి వ్యక్తపరిచారు. అనంతరం మహాకవి క్షేత్రయ్య ఆరాధ్య దైవమైన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో జరిగిన పూజాది కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరికి జిల్లాకు చెందిన అధికారులైన నోడల్ ఆఫీసర్ అమీర్ బాషా (ఈ.వో.పి.ఆర్.డి. ఉంగుటూరు), అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ ఏ శేఖర్ బాబు (ఏ.పీ.ఎస్. ఐ.ఆర్డి ఫీల్డ్ ఇన్స్పెక్టర్), టీం సభ్యులు జి శేషగిరిరావు (ఎండిఓ ఉంగుటూరు)లు గ్రామంలోజరిగిన అభివృద్ధి పనులపై వివరించారు. మొవ్వలో కేంద్ర బృందంతోపాటు గ్రామ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, ఈవోపీఆర్డి వీర్ల సీతారామరాజు, ఏ ఈ ఆర్డబ్ల్యూఎస్ కె ఎస్ ఆర్ ప్రసాద్ పలువురు పాల్గొన్నారు.

'బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ'

విశాలాంధ్ర-గుడివాడ : మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అధ్వర్యంలో శుక్రవారం జనసేన నాయకులతో కలసి బాబు షురిటీ భవిషత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని 7వ వార్డులోని కొత్తపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కలిసి ప్రకటించిన ఉమ్మడి కార్యాచరణను మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామ స్థాయిలో వార్డు స్థాయిలో కార్యకర్తలు అందరూ కలిసి పనిచేసి రాబోయే కాలంలో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గుడివాడలో గెలిపించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, జనసేన పట్టణ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, జనసేన పట్టణ ప్రధాన కార్యదర్శి సాయినరాజేష్, క్లస్టర్ ఇంచార్జ్ ముళ్ళపూడి రమేష్‌చౌదరి, నాయకులు తేనెల ఏడుకొండలు, కోసూరు ఆంజనేయులు, సాయిన నాని, మానుపాటి జేమ్స్, గుడివాడ విశ్వేశ్వరరావు, మొమ్ములేటి మంగారాజు, ఓలేటి రమేష్, కునుకు మోహన్, సుంకర వెంకట్, వాసా నవీన్, పిల్లా సాయికృష్ణ, కోనా వెంకటరమణ, మాకిన శివ, గోవాడ శివ, దాసు శ్యాంప్రసాద్, కోలవెన్ను గోపాలకృష్ణ, పొట్లూరి రమాదేవి, దారపురెడ్డి శేషు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి కులగణనపై శిక్షణ : కమిషనర్

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ పురపాలక సంఘ పరిధిలో గల వార్డ్ సచివాలయ సిబ్బందికి శనివారం కులగణనపై శిక్షణ ఇవ్వడం జరుతుందని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అదేశాల మేరకు 18వ తేది, శనివారం పట్టణంలోని సచివాలయలో కులగణన, ఆడుదాం- అంధ్ర అంశాలపై శిక్షణ కార్యాములు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యాక్రమంలో వాలంట్రీలు, సిబ్బంది శిక్షణ తీసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి రోలార్ స్కేటింగ్‌లో ప్రతిభ

విశాలాంధ్ర-గుడివాడ : ఈ నెలలో జరిగిన రాష్ట్రస్థాయి రోలార్ స్కేటింగ్ ఫెడరేషన్‌లో విశ్వభారతి విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎన్నికైనట్లు స్కూల్ చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని విశ్వభారతి విద్యాసంస్థలలో స్కూల్‌లో చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ అధ్వర్యంలో రాష్ట్రస్థాయి రోలార్ స్కేటింగ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రోలార్ స్కేటింగ్ విభాగంలో ఎస్‌నాగశివాత్మక సర్ణంతో పాటు రజత పతకాన్ని సాధించడం జరిగిందన్నారు. ఎం.జిషితసావిత్రి రజత, పి.కౌషిక్‌సాయి స్వర్ణపతకం, కె.సాయివర్షిత స్వర్ణపతకాన్ని, ఎం.రోహన్ స్వర్ణ, ఆర్.కె విన్‌పాల్, రజత, కాంస్యపతకాన్ని, ఎం.ఉమమహేష్ కాంస్య, డి.ఆషిష్‌గాంధీ, కాంస్య, కె.శ్యామ్ రజత పతాకలను సాధిండం గర్వకరణన్నారు. కె.శ్యామ్, జి.గాయత్రిలో జరిగే జాతీయస్థాయి పోటిలకు అర్హత సాధించడం గర్వంగ ఉందన్నారు.

భవిత సెంటర్‌లో ఫిజియోథెరఫీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : భవిత సెంటర్‌లో ఐ.ఇ.ఆర్.టి లు ఫిజియోథెరఫీ నిర్వహించారు. భవిత సెంటర్‌లో ప్రతి సోమవారం ఫిజియోతెరఫి నిర్వహించాల్సి ఉండగా దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని 13 వ తేది సోమవారం సెలవు దినం కావడంతో శుక్రవారం ఐ.ఇ.ఆర్.టి లు నాగదుర్గ, నాగమణి లు 14 మంది చిన్నారులకు ఫిజియోతెరఫి నిర్వహించారు. భవిత కేంద్రాన్ని ఎం.ఇ.ఒ 2 అన్నపరెడ్డి పిచ్చయ్య పర్యవేక్షించారు.

గాంధీక్షేత్రంలో మాట్లాడితే గాంధేయవాదులు కాదు : సింహాద్రి

విశాలాంధ్ర-అవనిగడ్డ : గాంధీక్షేత్రంలో కుర్చోని మాట్లాడిన్నంత మాత్రాన గాంధేయవాధులు కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని టిడిపి నేతలను వై.యస్.ఆర్.సి.పి అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం వైసిపి కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు అనే వ్యక్తి ఏ రోజు కూడా గాంధేయవాధి అని చెప్పుకోలేదని, కిరాయి మర్డర్ చేసే మీరు మాత్రం గాంధేయవాధి అని చెప్పుకుంటూ తిరుగుతున్నారని రమేష్ ఎక్కడికి వెళ్ళినా హంగుఆర్భాటాలు లేకుండా సామాన్య వ్యక్తిగా వెలతాడుకానీ, ముందు 3 కార్లు, వెనుక 2 కార్లతో వెళ్ళే వ్యక్తి కాదని గన్‌మ్యాన్ సహాయం లేకుండా ఎక్కడికైనా ప్రజల వద్దకు వెళ్ళే ప్రజా నాయకుడే సింహద్రి రమేష్ బాబు అన్నారు. అటువంటి వ్యక్తిని విమర్శించే ముందు మీరు మీ రాజకీయ జీవితాన్ని వెనక్కి తిరిగి చూసుకోవాలని వెంకటేశ్వరరావు అన్నారు. వైస్.ఎం.పి.పి దిడ్ల వెంకటేశ్వరరావు (కిరణ్) మాట్లాడుతూ హత్య కేసులో ఉన్న వారు గాంధీజీ వాదం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని, గత 4 సంవత్సరాలుగా ప్రశాంతంగా ఉన్న దివిసీమలో అల్లర్లు సృష్టించాలనే ప్రయత్నిస్తుంది మీరు కాదా ? భార్య భర్తల మధ్య మనస్పర్ధలు వచ్చి దానిని సరిచేయమని పెద్ద మనిషి దగ్గరకు వెలితే వారి ఆస్తులు రాయించుకున్న వ్యక్తులు కూడా గాంధీజీ గురించి మాట్లాడుతున్నారంటే గాంధేయవాధానికే అర్ధం లేకుండా పోయిందన్నారు. రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి గాజుల జయగోపాల్ మాట్లాడుతూ ఎం.ఎల్.ఎ సింహాద్రి రమేష్ బాబుకు వస్తున్న ప్రజా ధరణను చూసి ఓర్వలేక ఇటువంటి నీచమైన చర్యలకు టిడిపి నేతలు పాల్పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో జడ్.పి.టి.సి చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాషా, లంకమ్మఅమ్మవారి దేవస్థాన చైర్మన్ అన్నపరెడ్డి రామదాసు, ఎం.పి.టి.సి తోట గణేష్, మండల బిసి సెల్ అధ్యక్షులు సైకం నాగరాజు, అవనిగడ్డ సచివాలయ 1 కన్వినర్ యంత్రపాటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎస్టీయూ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-ఉయ్యూరు:- రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ సభ్యత్వ క్యాంపెయిన్ ను శుక్రవారం ఉయ్యూరు మండలం లో కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి పీకా. ఇమ్మానుయేలు సారధ్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వాటి పరిష్కారం గురించి ఎస్టీయూ సంఘం తీవ్రంగా కృషి చేస్తోందని జిల్లా అధ్యక్షులు మండవ శ్రీనివాస్ అన్నారు. ఉయ్యూరు, ఆకునూరు, పెదవోగిరాల, గండిగుంట, కడవకొల్లు, కాటూరు, కలవపాములలో సభ్యత్వ కాంపెయిన్ ను నిర్వహించారు. ఇందులో మండల ప్రధాన కార్యదర్శి బి.మిత్రా, రాష్ట్ర కౌన్సిలర్ ఏ.శ్రీనివాసమూర్తి, జిల్లా కౌన్సిలర్లు పీకా సుగుణాకర రావు, షేక్ సిలార్, మీర్జా, హసనైన్ పాల్గొన్నారు.

వేణుగోపాలరావు వికాస్ కేంద్రాన్ని సందర్శించిన అమరేంద్ర

విశాలాంధ్ర-ఘంటసాల: తుమ్మల వేణుగోపాలరావు వికాస కేంద్రం సందర్శించడం నా అదృష్టమని. భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు రాజ్యసభ సభ్యులు దాసరి నాగభూషణంతో తనికీల దాసరి అమరేంద్ర పేర్కొన్నారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్లపాటి వెంకట రామకృష్ణ మాట్లాడుతూ తెలుగు యాత్రా సాహిత్యంలో విశేషమైన కృషి చేస్తున్నారని గత 40 సంవత్సరాలుగా ఆయన చేసిన ప్రయాణాలు అన్నీ పలు పుస్తకాల రూపంలో వెలువరించారన్నారు. ఎప్పటి నుండో ఘంటసాల ప్రాంతాన్ని , ఇక్కడి విశేషాలను దర్శించాలని ఉందని, ఈరోజు ఈ ప్రాంతంలో ఉన్న విశేషాలు , ఇక్కడి గ్రామస్తులతో గడపటం చాలా సంతోషాన్ని ఇచ్చిందని అన్నారన్నారు. వామ పక్ష ఉద్యమాలతో అనుబంధం ఉన్న తమ కుటుంబానికి అభ్యుదయ వాది తుమ్మల వేణుగోపాలరావు, వారి కుటుంబముతో వున్న పరిచయాలు మరోసారి నెమరు వేసుకున్నారు. వికాస కేంద్రం నిర్వాహకులు వేమూరి శివయ్య , మూల్పూరి వెంకయ్య , వేమూరి ప్రసాద్ పలువురు గ్రామస్థులు వారిని సన్మానించారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

విశాలాంధ్ర-ఘంటసాల: మండల కేంద్రమైన ఘంటసాల శాఖ గ్రంధాలయము నందు జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంధాల అధికారి ఎం శరత్ కుమార్ ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగినది.

రేపు కంకిపాడు వెంకయ్య నాయుడు రాక

విశాలాంధ్ర-ఉయ్యూరు:- మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు ఈనెల 19న కంకిపాడుకు రానున్నారు. మాజీ కేంద్రమంత్రి కావూరి సాంబశివరావు 80వ పుట్టినరోజు వేడుకలను కంకిపాడు లోని ప్రముఖ అయాన కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. వెంకయ్య నాయుడు తో పాటు కేంద్ర మంత్రులు, ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు రానున్నట్లు సమాచారం.

గ్రామాలకు పాకిన సైబర్ వేధింపులు!

లబోదిబోమంటున్న బాధితులు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: సైబర్ నేరగాళ్ల వేధింపులు నగరాలు, పట్టణాలు దాటి, ఇప్పుడు గ్రామాలకు పాకాయి. తమ మానాన తాము వ్యవసాయ పనులు చూసుకుంటూ, పాడి పంటలతో కాలక్షేపం చేసే రైతులను సైబర్ నేరాలు ఇప్పుడు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి రైతుకు ఏదో ఒక బ్యాంకులో ఖాతాలు, సెల్‌ఫోన్ వాడకం తప్పని సరిగా మారింది. ఈ క్రమంలో వారి సెల్‌ఫోన్ నెంబరు, బ్యాంకు ఖాతాల ఆధారంగా కొందరు వ్యక్తులు వీరి నుంచి నగదు కాజేయటం, అవకాశం దొరక్కుంటే వీరి చిరునామా, ఫోన్ నెంబరు ఆధారంగా మోసానికి పాల్పడటం జరుగుతోంది. ఇలా డబ్బు పోగొట్టుకున్న నష్టపోయిన సంస్థలు ఇలా ఆధారంగా తమకు దొరికిన చిరునామా, ఫోన్ నెంబరును పట్టుకుని వేధింపులకు పాల్పడటం జరుగుతోంది. తమ గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా వ్యవసాయ పనులు చేసుకునే రైతులు ఇవేం తమకు తెలియక ఇవేం వేధింపులురా బాబోయ్ అంటూ ఆందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని తాతకుంట్ల గ్రామానికి చెందిన రైతు మందలపు నరేంద్రరావు అనే రైతుకు శుక్రవారం బెంగుళూరులోని ఎస్‌బిఐ బ్రాంచి నుంచి ఫోన్లు వచ్చాయి. వల్లమూడి లావణ్య అనే మహిళ తమ బ్యాంకులో క్రెడిట్ కార్డు పొందారని, తన వద్ద అప్పు వసూలుకు ఈ నెంబరును సంప్రదించాలంటూ మీ నెంబరు ఇచ్చారంటూ తెలిపారు. సదరు మహిళ, ఆమె కుటుంబసభ్యుల వివరాలు తెలపాలంటూ కోరారు. తనకు వారితో ఎటువంటి సంబంధం లేదని తెలిపినా, పలు నెంబర్ల నుంచి ఫోన్లు చేస్తూ వివరాలు చెప్పాలని, సంబంధం లేదని తెలిపినా కుదరదంటూ వేధింపులకు పాల్పడుతున్నారు. ఇలా తనకు ఒకే రోజు కొద్ది సమయం పరిధిలోనే కొన్ని నెంబర్ల నుంచి ఫోన్లు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు నరేంద్ర వాపోయారు. ఇదే విధంగా ఇదే గ్రామానికి చెందిన రవికిరణ్, నాగేంద్రరావు, కృష్ణ, రాధాకృష్ణ, తదితరులకు కూడా బెదిరింపులు వచ్చినట్లు తెలిసింది. గ్రామాల్లో వ్యవసాయ పనులు చేసుకునే తమకు ఇవేం వేధింపులో తెలియటంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వేధింపులపై పోలీసులను ఆశ్రయించనున్నట్లు వారు తెలిపారు.

హాస్య రచనలో అసామాన్యుడు శ్రీరమణ

విశాలాంధ్ర-విజయవాడ : తెలుగు హాస్య రచనలకు కొత్త పరిమళాలను అద్ది, ఆరోగ్యవంతమైన హాస్యాన్ని అందించిన శ్రీరమణ పండించిన హాస్యం అసమాన్యమైనదని సాహితీవేత్త కొప్పర్తి రాంబాబు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు శుక్రవారం హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన సభలో శ్రీరమణ హాస్య రచనలపై వక్తలు ప్రసంగించారు. శ్రీరమణ పేరడీలు, హాస్యరస ప్రధానమైనవే కాదని ఆలోచనా పూర్వకంగా ఉంటాయని డాక్టర్ సత్రీ అన్నారు. 'మిధునం' కథలో మానవ సంబంధాల్ని ముఖ్యమంగా మధ్య తరగతి సంసారంలో కన్పించే అనేక సంఘటనలు మన కళ్లకు కడతాయని చెప్పారు. ఈ సభలో బండ్ల మాధవరావు, ఎంఆర్ఎస్.ప్రకాశరావు డాక్టర్ జీవీ పూర్ణచంద్, డోగిపర్తి శంకరరావు తదితరులు పాల్గొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ వారు నిర్వహించిన కార్యక్రమంలలో నాల్గవ రోజు ప్రధాన వక్తగా విచ్చేసిన రంగరావు ప్రజలకు చేరువయ్యే దృష్టికి రచయితలు అలవాటు చేసుకోవాలన్నారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ నిస్సారమైన సాహిత్యం వలన ప్రజలు దూర ంఅవుతారని సోదాహరణంగా ప్రసంగించారు. సభకు జీవీ పూర్ణచంద్ అధ్యక్షత వహించారు. బెల్లపు బాబ్జీ, విశ్వేశ్వరరావు, వెన్నా వల్లభరావు, సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సర్వోత్తమ గ్రంథాలయానికి వెంకయ్యనాయుడు

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నవంబరు 19వ తేదిన ఆదివారం ఉదయం విజయవాడ సర్వోత్తమ గ్రంథాలయంలో జరుగు కార్యక్రమానికి భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరవుతున్నారని గ్రంథాలయ కార్యదర్శి డాక్టర్ రావి శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

యువతకు ఆదర్శనీయుడు రాయుడు

విశాలాంధ్ర-విజయవాడ : ప్రజాఉద్యమాలలో ముందు నిలిచి సమస్యపై పోరాడిన చింతమళ్ల రాముడు నేటి యువతకు ఆదర్శనీయుడని మాజీ కార్పోరేటర్ బుట్టి రాయప్ప నివాళులర్పించారు. రాముడు 35వ వర్ధంతి సందర్భంగా సీపీఐ 34వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో కేదారేశ్వరపేటలోని రాముడు స్మారకస్తూపం వద్ద శుక్రవారం శ్రద్ధాంజలి కార్యక్రమం జరిగింది. రాముడు స్మారకస్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం రాయప్ప మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికునిగా పని చేస్తూ నాటి నాయకులు కంటేపూడి సుధాకర్, కె.సుబ్బరాజు వంటి నాయకులతో రాముడు పార్టీ అభివృద్ధికి పాటుపడ్డారని గుర్తు చేశారు. ముఖ్యంగా యువకులను సమీకరించటానికి తీవ్రంగా కృషి చేశారని, ఆయన ఆశయాల సాధనకు పునరంకితం కావాలని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ 34వ డివిజన్ కార్యదర్శి కాళ్ల చిన్నప్ప, సహాయ కార్యదర్శి దొడ్డా కుమార్, కాళ్ల ప్రకాశరావు, సీహెచ్ మారయ్య, కాటుమాల జోసెఫ్, కాళ్ల థామస్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

30 గంటల దీక్ష జయప్రదం చేయండి

విశాలాంధ్ర-నందిగామ: 30 గంటల నిరసన దీక్షను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చుండూరి సుబ్బారావు కోరారు. స్థానిక రైతు పేట సిఆర్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చుండూరి సుబ్బారావు మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల 20 21 తేదీలలో సత్వరమే కరువు నివారణ చర్యలు చేపట్టాలని, కృష్ణాజిల్లాల పునఃపంపిణీపై బిజెపి నాటకాన్ని బహిర్గతం చేయాలని కోరుతూ జరిగే 30 గంటల దీక్షను జయప్రదం చేయాల్సిందిగా ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. కరువు కోరల్లో చిక్కుకున్న రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి కట్టా చామంతి, మండల కార్యదర్శి మన్నె హనుమంతరావు, ఏఐవైఎఫ్ నాయకులు షేక్ మౌలాలి, సాంబయ్య, గోపి, తదితరులు పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వం

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్న కృష్ణా జలాల పునః పంపిణీపై గెజిట్ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా, కరువు పరిస్థితులు పట్టించుకోని జగన్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 20, 21 తేదీల్లో జరిగే 30 గంటల నిరసన దీక్షలో జగ్గయ్యపేట నియోజకవర్గం నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ జగ్గయ్యపేట పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం డిపో సెంటర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయంలో దీక్షకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుతాలు ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ గట్టారు. తాగు, సాగునీరు లేక రైతులు పలు ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి జగన్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటాన్ని తప్పుబట్టారు. కరువుపై ప్రభుత్వం స్పందించక పోవటం దారుణమన్నారు. తెలంగాణ ఎన్నికల్లో లబ్ది పొందేందుకు మోదీ ప్రభుత్వం కృష్ణా జలాల వివాదాన్ని తెరపైకి తీసుకువచ్చిందని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేసారు. సాగునీరు లేక నష్టపోయిన పంటను పరిశీలన చేసి నష్టపోయిన ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ సహాయ కార్యదర్శి అంబోజి శివాజి, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు మాశెట్టి రమేష్‌బాబు, కార్యదర్శి పోతుపాక వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు భోగ్యం నాగులు, మస్తాన్, ముజీబ్, భాను, కిషోర్, సాయికుమార్, రాఖేష్, చందు, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వం దళితులపై కక్షగట్టింది : శ్రావణ్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : పాము తన పిల్లల్ని తానే పొడుచుకు చంపుకున్నట్లు....గద్దెనెక్కించిన దళితులను జగన్ ప్రభుత్వం చంపుకుతింటోంది అని జై భీమ్ రావు భారత్ పార్టీ అధినేత,హైకోర్టు న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గాంధీనగర్‌లోని వారి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు దొమ్మేరు గ్రామంలో పోలీసుల వేధింపులు తట్టుకోలేక దళిత యువకుడు బొంతు మహేంద్ర ఆత్మహత్య కలచివేసింది బొంతు మహేంద్రది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే అని ఆరోపించారు. సాక్షాత్తు దళిత హెూం మంత్రి ఇలాఖలో ఘటన జరగడం సిగ్గుచేటు అన్నారు. హెూంమంత్రిని గ్రామస్థులు ఘెరావ్ చేశారు అయినా స్పదించకపోవటం దుర్మార్గమైన విషయం అన్నారు. వైసిపికి ఏ అధికారం ఉందని సామాజిక సాధికారిక యాత్ర చేస్తున్నారు అది సామాజిక సాధికారత యాత్ర కాదు...నయవంచన యాత్ర అన్నారు. శనివారం(నేడు) వైసీపీ నయవంచన యాత్రపై ప్రతిపక్షపార్టీ,పౌర,ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నాం అన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న,దళిత జాతిని అవమానంగా మాట్లాడితే రానున్న రోజుల్లో బుద్ధి చెబుతాం అధికారంలోకి తీసుకు వచ్చిన జగన్ ప్రభుత్వాన్ని అదే దళితులు పొలిమేర వరకు తరిమికొడతారు గుర్తుపెట్టుకో అని హెచ్చరించారు.

గయాజుద్దీన్ ఆధ్వర్యంలో గ్యార్మీ వేడుకలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): గ్యార్మి వేడుకల సందర్భంగా శుక్రవారం సాయంత్రం భవానిపురంలోని మసీదే రజా వీధిలోని మసీదు వద్ద నుంచి ఐజా గ్రూప్ చైర్మన్, జనసేన నగర అధికార ప్రతినిధి షేక్ గయాజుద్దీన్ (ఐజా) ఆధ్వర్యంలో గ్యార్మి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గయాజుద్దీన్ మాట్లాడుతూ ఏక్యా రజా కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా క్రమం తప్పకుండా గ్యార్మీ వేడుకలను నిర్వహిస్తున్నామని, నేడు 17వ గ్యార్మి మహోత్సవం వైభవంగా నిర్వహించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ఐజా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మైనార్టీ నాయకులు ఎంఎస్ బేగ్, సారిపల్లి రాధాకృష్ణ, చిన్న సుబ్బయ్య, జనసేన మైనార్టీ నాయకులు కమాల్ అలీ, ఫిరోజ్ ,మహమూద్, ఇస్మాయిల్, మన్సూర్, ముస్సు , మైనర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ సీపీకి 11 ఫిర్యాదులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): డయల్ యువర్ సీపీకి 11 ఫిర్యాదులు అందాయి. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి శుక్రవారం జరిగే డయల్ యువర్ పోలీస్ కమీషనర్ కార్యక్రమంను ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతి రాణా ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ సీపీ కార్యక్రమం నిర్వహించారు. ఇందుకోసం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కేటాయించిన 0866-2490613 అనే నెంబర్ కు ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ కమీషనర్‌కు తెలియ జేయడం జరిగింది. వీటిలో ట్రాఫిక్ సమస్యలు, అసాంఘిక శక్తులు, కుటుంబ కలహాలు, ఆర్థికనేరాలు, స్థలం తగాదాల మొత్తం 11 ఫోన్ కాల్స్ చేయగా సీపీ సంబంధిత పోలీస్ స్టేషన్ యస్.హెచ్.ఓ.లతో, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించే దిశగా ఆదేశాలు జారీ చేశారు.

ఇద్దరి హత్య చేసిన కేసులో జీవిత ఖైదు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): ఇద్దరిని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు పడింది. విజయవాడ భవానిపురం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో విజయవాడ విద్యధరాపురం సితారా సెంటర్ కు చెందిన బోయా రవి (29) పై నేరం ఋజువు కావడంతో శుక్రవారం అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జ్ ఎస్.నాగేశ్వర రావు నిందితునికి జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసుకు సంబంధించి గత ఏడాది ఫిబ్రవరీ 5వతేదీన సితారా సెంటర్ కు చెందిన నారిండి శ్రీనివాసరావు పోలీస్ స్టేషన్ కు వచ్చి తన షాప్ ముందు ఒక వ్యక్తి తీవ్రమైన గాయాలతో చనిపోయినట్లు, మరొక వ్యక్తి తలపై తీవ్రమైన గాయాలతో కొన ఊపిరితో ఉన్నట్లు ఇచ్చిన ఫిర్యాదుపై భవానిపురం పోలీస్ వారు సంఘటనా స్థలానికి చేరుకొని గాయాలతో వున్న వ్యక్తిని ఆసుపత్రికి తరలించి, పోస్టుమర్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటి సీఐ మురళి కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో భాగంగా బోయా రవి (నిందితుడు) మద్యం చెడు వ్యసనాలకు బానిసై బార్లు వద్ద తిరుగుతూ తెలిసిన వారిని తెలియని వారిని మద్యానికి డబ్బులు అడిగి తీసుకుని మద్యం తాగుతూ జీవిస్తుంటాడు. ఈ క్రమంలో గత ఏడాది ఫిబ్రవరి 4వతేదీన రాత్రి సమయంలో సీతారా సెంటర్ సమీపంలో వైన్ షాప్ వద్ద ఇద్దరు వ్యక్తులు నిలబడి వుండగా వెళ్లి వారిని బెదిరించి డబ్బులు అడుగగా వారు ఇద్దరు కలిసి రవిపై తిరగబడి నెట్టివేశారు. నిందితుడు బోయ రవి వారిపై కోపంతో వారికి తెలియకుండా వారిని వెంబడించి అర్ధరాత్రి సమయంలో సితారా సెంటర్ వద్ద ఉన్న షాప్ బయట నిద్రపోవడాన్ని గమనించి వారిని చంపాలనే దురుద్దేశంతో పక్కనే వున్న సిమెంట్ రాయితో వారి తలలపై బలంగా కొట్టాడు. కొద్దిసేపటి తరువాత అనుమానంతో తిరిగి వచ్చి వారు చనిపోయారో లేదో చూడగా ఒకరు కదలికలను గమనించి పక్కనే వున్న మరో చిన్న రాయిని తీసుకుని అతని తలపై గట్టిగా కొట్టాడు. చనిపోయారు అని నిర్ధారించుకున్న అక్కడి నుంచి పారియాడు. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. నేరం రుజువకావడంతో నిందితుడికి జీవిత ఖైదు పడింది.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు-రూ.1.29లక్షలు స్వాధీనం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను విజయవాడ పటమట పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వివరాల ప్రకారం రామవరప్పాడుకు చెందిన ప్రతాప్‌రెడ్డి గుణదలోని ఓ టల్‌లో పనిచేస్తాడు. రామవరప్పాడులోని తన ఇంటిలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నాడు. పేకాడుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పటమట పోలీసులు వారి పై దాడి ఏడుగురిని అరెస్టు చేశారు. సుమారు రూ. 1.29లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : హైదరాబాదు నుండి సొంత గ్రామానికి బైకు పై బయలుదేరిన యువకునికి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన సంఘటన జరిగింది. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామ సమీపము కు రాగానే రాంగ్ రూట్లో వస్తున్న మినీ వ్యాన్ (ఏపీ 39 యు 6 3819) వాహనం ఢీకొని బైక్ పై వస్తున్న తోటవల్లూరు కు చెందిన బొమ్మ రెడ్డి ప్రదీప్ రెడ్డి అనే యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. కాలుకు రెండుచోట్ల ఫ్రాక్చర్ అవ్వగా, చేతి మూడు వేళ్ళ కు ఫ్రాక్చర్ అయిందని తెలిసింది. అదే సమయంలో మైలవరం పర్యటనను ముగించుకుని వస్తున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గన్నే వెంకటనారాయణ ప్రసాద్ తన కారు అప్పి వెంటనే హాస్పిటల్లో చేర్పించి పరిస్థితిని సమీక్షించారు. యువకునికి సరైన ఐక్యం సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆస్పటల్ సిబ్బంది సూచించారు. ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జాయింట్ అకౌంట్ ప్రక్రియ వేగవంతం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జిల్లాలోని వివిధ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు 2022-23 విద్యా సంవత్సరానికి జగనన్న విద్యా దీవెన నిధులు పొందేందుకు విద్యార్థి తన తల్లితో బ్యాంకు ఉమ్మడి ఖాతా తెరచే ప్రక్రియ ఈనెల 24వ తేదిలోగా పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. ఈనెల 28వ తేదీన డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన 4వ విడత నిధులను జమ చేసేందుకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఎస్సీ, బీసీ, ఇబీసీల సంక్షేమ అధికారులతో కలెక్టర్ శుక్రవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన లబ్దిని పొందేందుకు విద్యార్థులు వారి తల్లితో ఉమ్మడి ఖాతా తెరచి ఆయా బ్యాంక్ అకౌంట్ వివరాలను ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. జిల్లాలో 20,536 మంది డిగ్రీ విద్యార్థులు ఉమ్మడి ఖాతాను తెరవాల్సి ఉందని, ఎస్సీ వర్గానికి చెందిన విద్యార్థులతో పాటు ఫైనల్ ఇయర్ చదువుతున్న ఇతర వర్గాల విద్యార్థులు మినహా ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులతో తక్షణమే ఉమ్మడి ఖాతాలు తెరిచేందుకు బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖాధికారులకు సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు విజయభారతి, గిరిజన సంక్షేమ అధికారి రుక్మాంగదయ్య, ఎల్‌డీఎం ప్రియాంక, గ్రామ, వార్డు సచివాలయ ప్రత్యేకాధికారి అనురాధ, నగర పాలక సంస్థ అడిషనల్ కమీషనర్ శకుంతల పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారమే జగనన్నకు చెబుదాం

గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడమే జగనన్నకు చెబుదాం లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. నందిగామ డివిజన్‌లోని వత్సవాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుండి వినతులను స్వీకరించారు. మండలంలోని 27 గ్రామాల నుండి వచ్చిన 135 అర్జీల్లో ఎక్కువగా పట్టాదారు పాసుపుస్తకాల మంజూరు, అడంగల్ పేర్ల సవరణ, సర్వే నంబర్లలలో తప్పులను సరిచేయాలని కోరుతూ అర్జీలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్పంచ్ సీతమ్మను ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి కరువు సాయాన్ని అందించాలని, పోలంపల్లి డ్యామ్‌కు పడిన గండ్లు తక్షణమే పూడ్చి రైతులను ఆదుకోవాలని, లింగాల వద్ద మునేటి వంతెనకు శాశ్వత పరిష్కారం కోరుతూ పలువురు పరిశీలించి అర్జీలు అందించారు. అనంతరం దుబ్బాకుపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ పనులు వేగవంతంగా జరగడం పట్ల సంతృప్తి వ్యక్తంచేస్తూ లబ్దిదారులు త్వరితగతిన గృహప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కొట్టి నగేష్‌ను కోరారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నిర్వహించిన కంటి పరీక్షల్లో గుర్తించిన 85 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ అవసరం కాగా వీరిని పెదకాకాని శంకర కంటి ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సును కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జేసీ డా.పీ.సంపత్‌కుమార్, నందిగామ ఆర్డీవో పీ.సాయిబాబా, డీఎంహెచ్‌వో డా.ఎం.సుహాసిని, డీఆర్డీఏ పీడీ కే.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళా పోలీసులు, అంగన్వాడిలకు అవగాహన

విశాలాంధ్ర-నందిగామ: మండల పరిషత్ కార్యాలయం లో నందిగామ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ని మహిళా పోలీసులకు, అంగన్వాడి టీచర్లకు బాల్యవివాహాల ను నిరోధించడం, మాదకద్రవ్యాల నియంత్రణ, దత్తత నియమావళి అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు, బాలల వారోత్సవాల్లో భాగంగా చైల్డ్ రైట్స్ ఎడ్వైసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన సదస్సులో ఎంపీడీవో పి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్యవివాహాలు ఆపడం ప్రతి ఒక్కరి బాధ్యతని, బాలల హక్కులు నవరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదిని అన్నారు, ఏ సి డి పి ఓ కృష్ణకుమారి మాట్లాడుతూ దత్తత తీసుకోవటం విధానాన్ని మహిళా పోలీసులు అంగన్వాడీ టీచర్లు గ్రామస్థాయిలో అందరికీ అవగాహన కల్పించడం ద్వారా చట్టబద్ధమైన దత్తతను ప్రోత్సాహం కల్పించడం జరుగుతుందని తెలిపారు. స్టేట్ కోఆర్డినేటర్ సిహెచ్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ బాల్యవివాహాల చట్టరీత్యా నేరమని, బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరం నిండిన వారుచట్ట ప్రకారం వివాహం చేసుకోవడానికి అర్హత ఉన్నది అని చెప్పారు, ఈ సదస్సులో అధికారులు సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, మహిళా పోలీసుల చే బాల్యవివాహాలు నియంత్రణపై ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : విజయవాడ నగరం మొత్తం ఐఆర్‌సీ(ఇండియన్ రోడ్ కాంగ్రెస్) గైడ్‌లైన్స్‌కి అనుగుణంగా ఉండాలని, రోడ్ ప్రమాదాలను అరికట్టాలంటే ఐఆర్‌సీ గైడ్‌లైన్స్ కీలకమని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. స్థానిక వీఎంసీ కార్యాలయం లోని కమిషనర్ ఛాంబర్‌లో పోలీస్, ట్రాన్స్‌పోర్ట్, నేషనల్ హైవే, ఆర్ అండ్ బీ అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణకు కమిషనర్ శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవే శాఖల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు ఐఆర్‌సీ గైడెన్స్ అమలు చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రుల వద్ద సైన్ బోర్డులు ఏర్పాటుచేసి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో రోడ్ల వెంట ఆక్రమణలను తొలిగించాలని టౌన్ ప్లానింగ్ అధికారుల ఆదేశించారు. నగరంలోని ప్రతి ఒక్క రోడ్ ఐఆర్‌సీ గైడ్‌లైన్స్ ప్రకారం ఉండాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్‌ఎం దానం, నేషనల్ హైవే ఇంజనీర్ నాగేశ్వరావు, ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసాద్, వీఎంసీ సీఈ ప్రభాకరరావు, అడిషనల్ కమిషనర్ కేవీ సత్యవతి, చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్, ఎస్ఇ నరసింహమూర్తి, ఆర్ అండ్ బీ డీఈఈ ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యక్తి తప్పిపోయినట్లు పిర్యాదు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైల్వేస్టేషన్‌లో తన భర్త తప్పిపోయినట్లు ఒక మహిళ శుక్రవారం పిర్యాదు చేసినట్లు రైల్వే సిఐ పి.శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం ప్రకాశం జిల్లా కంబం గ్రామానికి చెందిన తిరుపతయ్య(42) గత 20 సంలుగా అరుణాచల్‌ప్రదేశ్‌లో జనరల్ రిజ్వర్ ఇంజనీర్ ఫోర్సు (జిఆర్ఈఎఫ్) లో పని చేస్తున్నారు. శెలవులకు సొంత ఊరు వచ్చి ఈ ఏడాది మార్చి 9న డ్యూటీ కోసం గౌహితకి వెళ్ళారు. అప్పటి నుండి ప్రతిరోజుభార్య కాసుల సరస్వతికి క్రమం తప్పకుండా ఫోన్ చేసేవారు. గత మే 14న 60 రోజులు శెలవు పెట్టి తన తోటి ఉద్యోగి అయిన తమిళనాడుకు చెందిన మురుగన్‌తో కలసి గౌహతి నుండి రైలు నెంబర్ 12510 ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి 15వ తేదీన రాత్రి 11 గంటలకు విజయవాడకు చేరుకుంటానని అక్కడ నుండి సొంత ఊరుకు వస్తానని ఫోన్ ద్వారా సమాచారం అందించారు. మరో 20 నిముషాలలో విజయవాడలో దిగబోతున్నామని భార్యకు తెలిపాడు. ఆమె విజయవాడ,ఇతర ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవటంతో కుంబం పోలీసుస్టేషన్‌లో పిర్యాదు చేసింది. దాంతో అక్కడ పోలీ సులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి రైల్వే జిఆర్‌పికి బదిలి చేశారన్నారు. ఇక్కడ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు. కంబం గ్రామానికి రైలులో వస్తారు. ఫిర్యాదుదారు 15.05. 2023న 21.00 గంటలకు తన భర్తకు ఫోన్ చేశాడు, అప్పుడు తప్పిపోయిన వ్యక్తి విజయవాడ రైల్వే స్టేషన్‌కు వచ్చానని, అతను రైలు దిగుతున్నానని చెప్పగా, 20 నిమిషాల తర్వాత ఫిర్యాదుదారు తన భర్తకు ఫోన్ చేశాడు, తమిళనాడు రాష్ట్రానికి చెందిన గుర్తు తెలియని మురుగన్ ఒకరు లిఫ్ట్ చేశారు. ఫోన్ చేసి, తప్పిపోయిన వ్యక్తి వాష్ రూమ్‌కి వెళ్లాడని, అతను తిరిగి రాలేదని, అతని ఫోన్ మరియు సామాను నాతో పాటు కాట్పాడి వెళ్తున్నానని చెప్పాడు. ఫిర్యాదుదారుడి నివేదిక ఆధారంగా, కంబమ్ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి అధికార పరిధి మేరకు విజయవాడ ఆర్‌పిఎస్‌కి బదిలీ చేశారు.

రైళ్లలో పేలుడు పదార్థాల రవాణాపై తనిఖీలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైలు ప్రమాదాలు జరగకుండా ముఖ్యంగా ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అనేక చర్యలు చేపట్టామని ముఖ్యంగా రైళ్ళలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ సేఫ్టీ గురించి ప్రజలకు,ప్రయాణికులకు అవేర్ నెస్ కార్యక్రమాలు నెల రోజుల పాటు చేపట్టడం జరిగిందని డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ పాటిల్ తెలిపారు. శుక్రవారం డివిజనల్ కార్యాలయంలో ఉన్న కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరుల సమావేశంల నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణకు ప్రయాణికులలో అవగాహన పెంపొందించడానికి డివిజన్ వ్యాప్తంగా స్పెషల్ ఫైర్ సేఫ్టీ డ్రైవ్/చర్యల చేపట్టామన్నారు.ప్రయాణీకుల భద్రతకు సంబంధించి ప్రధాన స్టేషన్లలో ఆర్‌పిఎఫ్ బృందాలు,టిక్కెట్ చెకింగ్ స్క్వాడ్‌లతో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ఇన్‌స్పెక్టర్లు ప్రయాణికులు మండే పదార్థాలు / పేలుడు పదార్థాల రవాణా చేయకుండా ప్రత్యేక డాగ్ స్క్వాడ్‌ను ఇతర స్కానర్స్ ద్వారా తనిఖీలు చేపట్టామన్నారు. మండే, పేలుడు పదార్థాలను తీసుకెళ్లడం శిక్షార్హమైన నేరమన్నారు. రైల్వే చట్టం 1989లోని సెక్షన్ 67, 164, 165 ప్రకారం రూ.1,000 వరకు జరిమానా గాని మూడేళ్ల వరకు జైలు శిక్షతో కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఆర్ఎమ్ ఎమ్.శ్రీకాంత్(ఆపరేషన్స్),సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, సీనియర్ సెక్యూరిటీ కమీషనర్(డిఎస్‌సి)వల్లేశ్వర్ బి. తోకల, సీనియర్ డిఈఈ(మెయింటెనెన్స్) టి.సురేష్, రైల్వే పిఆర్ఓ నుస్రత్ ఎం. మంద్రుప్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలపై ఉక్కుపాదం

జేసీబీతో సహా ఆరు ట్రాక్టర్లు స్వాధీనం

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలం ఓబులాపురంలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ మట్ట తవ్వకాలకు పాల్పడుతున్న మట్టి మాఫీయా దారులు, వారి వాహనాలపై మైలవరం సిఐ డీకే మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రెడ్డిగూడెం ఎస్సై శ్రీను ఉక్కుపాదం మోపారు. ఇందులో భాగంగా రెడ్డిగూడెం మండలం ఓబులా పురం గ్రామంలోని నాగసారిపాటి చెరువులో శుక్రవారం అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నరన్నా సమాచారం తెలుసుకున్న సీఐ డీకే మోహన్‌రెడ్డి వెంటనే సమాచారాన్ని స్థానిక ఎస్సై శ్రీనుకు అందజేశారు. సిబ్బందితో వెళ్లి మట్టి తవ్వకాలకు వినియోగిస్తున్న ఒక జేసీబీతో పాటు అక్రమ మట్టిని తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను రెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ మట్టి తవ్వకాలపై మైలవరం సిఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనుఉక్కుపాదంతో సమాచారం తెలుసుకున్న మట్టి మాఫీయాదారుల్లో ఆందోళన మొదలైంది. ఇదిలా ఉండగా ఇటీవల కాలంలో రెడ్డిగూడెం మండలంలో అక్రమ మట్టి తవ్వకాలు జరిపి ట్రాక్టర్లకు టేపు రికార్డు సౌండ్‌తో తరలించడంపై కూడా పలువిమర్శలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో మైలవరం సిఐ మోహన్‌రెడ్డి, అక్రమ మాఫీయాదారులపై ప్రత్యేక శ్రద్ధ చూపడం పట్ల రెడ్డిగూడెం మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే రమణగా ఓబులాపురంలో అక్రమ మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీను తెలిపారు. ఓబులాపురం మట్టి తవ్వకాలకు సంబంధించి రెవెన్యూ అదికారులు స్పందించారు.

Estd. 1998 Regd. No. G 3069

ది స్వశక్తి మర్కంటైల్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

40-4-5ఎ, జాస్తి వెంకటరత్నం వీధి, మానర్ ఫుడ్ ప్లాజా ఎదురు వీధి, లబ్బీపేట, విజయవాడ - 520 010.

ఎన్నికల నోటీసు

పదిహేను డైరెక్టర్ల పదవికి ఎన్నికల నోటీసు నోటిఫికేషన్ ఎన్నికల అధికారి శ్రీ బి.సాంబిరెడ్డి గారు ఇచ్చియున్నారు. ఎన్నికల షెడ్యూలు తేది 10-12-2023న పోటీ ఉన్నచో, ఎన్నికలు జరిపించబడును. తేది. 02-12-2023న నామినేషన్‌లు స్వీకరణ బ్యాంకు ఆఫీసులో ఉ॥09.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గం॥ల వరకు. తేది.03-12-2023న నామినేషన్‌లు పరిశీలన ఉ॥ 10.00 గం॥లకు బ్యాంకు కార్యాలయములో జరుగును. తేది.04-12-2023న నామినేషన్‌లు ఉపసంహరణ సాయంత్రం 5.00 గం॥ల వరకు. ఇతర వివరములకు బ్యాంకు C.E.O. గారిని సంప్రదించగలరు.

గమనిక : నామినేషన్ పత్రములు ఉచితముగా బ్యాంకు కార్యాలయ పనివేళలలో పొందగలరు.

తేది : 18-11-2023

ప్రదేశం : విజయవాడ. బి. సాంబిరెడ్డి, ఎన్నికల అధికారి.

గిరిజనుల జీవితం వైవిధ్య భరితం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో జీవిస్తున్న గిరిజనుల జీవన విధానం వైవిధ్యభరితమని ఏపీ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ టీ శ్రీనివాసన్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎకనామిక్స్, కామర్స్ అండ్ మేనేజమెంట్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 'భారతదేశంలో గిరిజనుల జీవితం అభివృద్ధి విస్తృతి' అంశంపై రెండు రోజులపాటు జరిగే జాతీయ సదస్సు శుక్రవారం ఆ కళాశాల ప్రాంగణంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీనివాసన్ ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో యావత్ ప్రపంచం కాలుష్య సహితమై మానవ జీవనం అనేక ప్రభావాలకు గురవుతుందన్నారు. అయితే ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం, సదుపాయాలు లేకున్నా గిరిజనుల జీవితం అత్యంత ఆరోగ్యకరంగా, సంప్రదాయ బద్ధంగా ఇప్పటికీ కొనసాగుతుందన్నారు. గిరిజనులు వారి సంప్రదాయాలను, జీవన విధానాలను వదిలి బయటకు వచ్చే క్రమంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి తదితర అంశాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయన్నారు, గిరిజనుల అభ్యున్నతి, అవకాశాలు తదితర అంశాలపై రెండు రోజులపాటు జరిగే జాతీయ సదస్సు ఫలప్రదం కావాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఏపీ ఉన్నత విద్య రెగ్యులేటరీ అండ్ మోనిటరింగ్ కమిషన్ ఉపాధ్యక్షులు పీ.విజయ ప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావులు ఈ సభలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు అన్నామలై విశ్వవిద్యాలయం కామర్స్ విభాగ ఆచార్యులు డాక్టర్ ఆర్ రామచంద్రన్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, కన్వీనర్ డాక్టర్ సిహెచ్ వేణుబాబు , కామర్స్ విభాగాధిపతి హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వృద్ధులకు డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. విజయవాడ 27 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మా దు వెంకట కృష్ణారావు విజయలక్ష్మి దంపతుల అమెరికా లో ఉన్న కుమారుడు మాదు దుర్గాప్రసాద్, సృజన ల పెళ్లి రోజు, మనవరాలు కుందనిక పుట్టిన రోజు సందర్భంగా ఆశ్రమం లోని వృద్ధులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భముగా దాత వెంకట కృష్ణారావు మాట్లాడుతూ అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న అన్నారు. వృద్ధులకు అన్నదానం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్, కార్యదర్శి కొండాయ గుంట రాము,తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు విశేష స్పందన

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): తిరుపతి నగరంలో తిరుచానూరు రోడ్‌లో వీధి లైట్లు, రోడ్ సమస్యలున్నాయని అఖిల సాంఘిక సంక్షేమ సంస్థ నగరంలోని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సొసైటీ సభ్యులు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, జిల్లా కలెక్టర్, భూమన కరుణాకరరెడ్డి, ప్రభుత్వానికి విజయవాడ నుంచి స్పందన ద్వారా అర్జీ సమర్పించారు. దీంతో వారు స్పందిస్తూ వెంటనే తిరుచానూరులోని సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని సానుకూలంగా స్పందించారు. దీంతో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు. త్వరలోనే లైట్లు, రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

న్యూట్రిపుల్‌స్టెమ్‌తో కొత్తపీడియాష్యూర్‌ను ప్రారంభించిన అబాట్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): పిల్లలు ఎదగడానికి, వారి పూర్తి సామర్థ్యాన్ని చేరుకోవడానికి సరైన పోషకాహారం చాలా కీలకం అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న సుమారు 149 మిలియన్ల మంది పిల్లలు ఎదుగుదల లోపంతో ఉన్నారు. వీరిలో మూడో వంతు లేదా 40. 6 మిలియన్ల మంది బాలలు భారతదేశంలో ఉన్నారు. అంతర్జాతీయ ఆరోగ్య సంరక్షణ కంపెనీ అయిన అబాట్, పిల్లల ఎదుగుదల, అభివృద్ధికి తోడ్పడేందుకు న్యూట్రిస్టెమ్ తో కూడిన కొత్త పీడియా ష్యూర్ ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. న్యూట్రి-పుల్ సిస్టమ్ అనేది విటమిన్ కె2, విటమిన్ డి, విటమిన్ సి, కేసైన్ ఫాస్ఫోపెప్టైడ్ (సీసీపీలు) వంటి పదార్థాల ప్రత్యేకమైన కలయిక. ఇది కీలక పోషకాలు బాగా గ్రహించడం ద్వారా పిల్లలలో క్యాచ్-అప్ పెరుగుదలకు తోడ్పడుతుంది

ఇన్సులిన్ అస్పార్ట్, ఇన్సూక్విక్ లాంచ్ కోసం కోసం బయోజెనోమిక్స్ తో భాగస్వామ్యం చేసుకున్న యుఎస్‌వి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశపు మొట్టమొదటి బయోసిమిలర్ ఇన్సులిన్ అస్పార్ట్, ఇన్సూక్విక్ ని విడుదల చేసినట్లు యుఎస్ వి ప్రైవేట్ లిమిటెడ్ బయోజెనోమిక్స్ ప్రకటించాయి. మధుమేహం ఉన్నవారి చికిత్స అవకాశాలను ఇది మెరుగుపరుస్తుంది.భారతదేశంలో పెరుగుతున్న ఆరోగ్య సమస్యగా మధుమేహం నిలుస్తుంది. దేశపు జనాభా లో 11.4 శాతం అంటే 101 మిలియన్ ల మంది ఈ సమస్య తో బాధపడుతున్నారు. ఇది కాకుండా, అదనంగా 136 మిలియన్ల మంది ప్రీడయాబెటిక్ సమస్యతో ఉండటం తో పాటుగా తక్కువ సమయంలో డయాబెటిస్ గా మారే అవకాశం కలిగి ఉన్నారు. ఇన్సూక్విక్ అనేది "మేక్ ఇన్ ఇండియా" ఉత్పత్తి. 100శాతం స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి తయారు చేయబడింది. ప్రపంచ నాణ్యతా ప్రమాణాల కోసం అత్యంత క్లిష్టమైన క్లినికల్ పరీక్షలను ఎదుర్కొంది. ఇది అన్ని మెట్రోపాలిటన్ నగరాల్లో అందుబాటులో ఉంది.

విశ్వకర్మ యోజన పథకం రుణాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సాంప్రదాయిక చేతివృత్తి కార్మికులకు, హస్తకళ నిపుణులకు స్కిల్ నైపుణ్యాభివృద్ధి, పరికరాల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా రుణాల మంజూరుకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వడ్రంగులు, సుత్తులు, తాళాలు, బంగారం పని, తాపీ, దర్జీ మొదలగు చేతి వృత్తి కార్మికులకు ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద 5 శాతం వడ్డీతో రూ.3 లక్షల వరకు బ్యాంకుల నుండి రుణ సహాయం అందించడం జరుగుతుందన్నారు. విశ్వకర్మ యోజన పథకం కింద ఆర్థిక సహాయం పొందేందుకు కనీసం 18 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలన్నారు. ఇప్పటికే పీఎం ఈజీపీ, పీఎం స్వనిధి, ముద్ర రుణాలను పొందిన వారికి పీఎం విశ్వకర్మ యోజన పథకం వర్తించదన్నారు. రుణాలను పొంది తిరిగి చెల్లించిన వారిని అర్హులని, కుటుంబంలో ఒకరికి మాత్రమే పథకం వర్తిస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల వారి కుటుంబ సభ్యులకు ఈ పథకం వర్తించదన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకం దరఖాస్తు చేసుకోనే అర్హులు ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్, రేషన్‌కార్డు తో పాటు ఇతర ప్రభుత్వ ఆమోదం పొందిన డాక్యుమెంట్లు, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నెంబరు జత చేసి దరఖాస్తులను pmvishwakarma.gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇతర వివరాలకు ఓ.హేమచంద్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వారి కార్యాలయంలోని కామన్ సర్వీస్ సెంటర్ల, వెబ్‌సైట్‌లో సంప్రదించాలని తెలిపారు.

హాస్య రచనలో అసామాన్యుడు శ్రీరమణ

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): తెలుగు హాస్య రచనలకు కొత్త పరిమళాలను అద్ది, ఆరోగ్యవంతమైన హాస్యాన్ని అందించిన శ్రీరమణ పండించిన హాస్యం అసామాన్యమైనదని కొప్పర్తి రాంబాబు అన్నారు. జాతీయ గ్రంథాలయంలో జరిగిన సభలో శ్రీరమణ హాస్య రచనలపై పలువురు వక్తలు ప్రసంగించారు. శ్రీరమణ పేరడీలు హాస్యరస ప్రధానమే కాకుండా, ఆలోచనా పరంగా ఉంటాయని డాక్టర్ సత్రే పేర్కొన్నారు. మిథునం కథలో మానవ సంబంధాల్ని, ముఖ్యంగా మధ్య తరగతి సంసారాలలో కన్పించే అనేక సంఘటనలు మన కళ్లకు కడతాయన్నారు. ఈ కార్యక్రమంలో బండ్ల మాధవరావు, ఎం ఆర్ ఎస్ ప్రకాశరావు, డాక్టర్ జీ వి, పూర్ణచందు, దోనెపర్తి శంకరరావు ప్రభృతులు పాల్గొన్నారు.

నెలలు నిండకుండా జన్మించిన శిశువులకు సంరక్షణ

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్) : నెలలు నిండకుండా జన్మించిన శిశువుల బాధ్యత తీసుకున్న రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌కు ఆంధ్రప్రదేశ్ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కేజీవి సరిత, విజయవాడ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, సబ్ కలెక్టర్ అదితి సింగ్ లు ధన్యవాదాలు తెలిపారు. రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ముందస్తుగా నెలలు నిండకుండా జన్మించే బాలల సంరక్షణ పేరిట ప్రతి ఏటా నవంబర్ 17వ తేదీన నిర్వహించే ప్రపంచ ప్రీ మెచ్యూరిటీ ఉత్సవాలలో భాగంగా హోటల్ నోవోటెల్ హాల్ లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కేజీవి సరిత, విజయవాడ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, సబ్ కలెక్టర్ అదితిసింగ్ పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ నెలలు నిండని శిశువులు, వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్నిచ్చే తన కథను ఉత్తేజాన్ని కలిగించే విధంగా చెప్పి, ఆహ్వానితులందరికి స్ఫూర్తినిచ్చారు. ఈ సంఘటన మన సమాజానికి ఆదర్శనీయమని, శిశువుల తల్లి తండ్రులకు, కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని నింపుతుందన్న అభిప్రాయం అహ్వానితులలో కలిగింది. అదితి సింగ్ మాట్లాడుతూ ప్రీ మెచ్యూరిటీ ఉత్సవ వేదిక నెలలు నిండని శిశువుల వారి ప్రయాణాన్ని గుర్తించడంలో ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. అధునాతన వైద్య సంరక్షణ తో చిన్నారుల వైద్యంలో ఆశాకిరణం గా నిలిచిన రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ అని కొనియాడారు. ఈ సందర్భంలో తల్లిదండ్రులను, వారి చిన్నారులను అభినందించి, శిశువులకు తల్లిపాలను దానం చేసే పోషించిన తల్లులను ఆసుపత్రి వారు ఆహ్వానించి సత్కరించారు. అనంతరం డాక్టర్ ఎన్ రామ్ ప్రసాద్ మాట్లాడుతూ రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ మరియు బర్త్‌రైట్ బై రెయిన్‌బో హాస్పిటల్, గర్భం దాల్చినప్పటి నుండి (ప్రెగ్నెన్సీ), నవజాత శిశువుల సంరక్షణ మరియు పీడియాట్రిక్ సేవలు, ఫీటల్ మెడిసిన్, అబ్స్టెట్రిక్స్, నియోనాటాలజీ, పీడియాట్రిక్ స్పెషాలిటీస్ మరియు నవజాత ఇంటెన్సివ్ కేర్‌లో సమగ్ర సంరక్షణను అందిస్తున్నదన్నారు. డాక్టర్ బిఎస్ సిరి రాజు మాట్లాడుతూ రెయిన్ బో ఆసుపత్రి లో నిపుణుల బృందంతో, (ప్రెగ్నెన్సీ), పీడియాట్రిక్ సేవలలో సంపూర్ణ సంరక్షణను అందిస్తుందని తెలిపారు. డాక్టర్ వంశీ శివరామ రాజు మాట్లాడుతూ ముఖ్యంగా రెయిన్‌బో హాస్పిటల్, విజయవాడలో ప్రారంభం అయినప్పటి నుండి 1500 మందికి పైగా నెలలు నిండ కుండా జన్మించిన శిశువులను రక్షించడం ద్వారా అసాధారణమైన నవజాత సంరక్షణ మరియు సున్నితమైన వైద్య పరిస్థితులను నిర్వహించడంలో తన నైపుణ్యాన్ని చాటి చెప్పుకుందని, గిన్నిస్ బుక్ రికార్డ్ సాధించిందని పేర్కొన్నారు. సీనియర్ కన్సల్టెంట్ అబ్స్టెట్రీషన్, గైనకాలజిస్ట్, డాక్టర్ ఉమా మిక్కిలినేని మాట్లాడుతూ రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఈ విషయంలో ఒక ఆదర్శప్రాయమైన ప్రమాణాన్ని నెలకొల్పిందని, మేము అన్నింటికీ సిద్ధంగా ఉన్నామని చెప్పడానికి మేము గర్విస్తున్నామన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రీజియన్ హెడ్ డాక్టర్ రావి శ్రీనివాసరావు, యూనిట్ హెడ్ శ్రీ గుణశేఖర్ లు మాట్లాడుతూ వైద్య సహాయాన్ని అందించి, ఎక్కువ మంది శిశువులను రక్షించి, మరింతమంది చిన్నారులకి, వారి కుటుంబాలకి చిరునవ్వులు అందించడమే మా ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్ బో ఆసుపత్రి లో చికిత్స పొందిన 50 కుటుంబాల తల్లి, తండ్రులు వారి కుటుంబసభ్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ప్రాధాన్యత భవనాలైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ ఆర్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాల్ని ప్రత్యేక దృష్టి పెట్టి నిర్ణీతంగా గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుని ఎప్పటికప్పుడు నివేదికలను సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన ప్రాధాన్యత భవనాల నిర్మాణాల ప్రగతిపై స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి కలెక్టర్ శుక్రవారం సంబంధిత అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన ప్రాధాన్యత భవనాలైన 233 గ్రామ సచివాలయాలకు 138, 141 రైతు భరోసా కేంద్రాలకు 76, 114 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ 55 భవనాలను పూర్తి చేసి సంబంధిత అధికారులకు అప్పగించడం జరిగిందన్నారు. మిగిలిన వివిధ దశల్లో ఉన్న 95 గ్రామ సచివాలయాలు, 65 రైతు భరోసా కేంద్రాలు, 59 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలను నిర్ణీతంగా గడువులోపు పూర్తి చేసేందుకు అధికారులు దృష్టి పెట్టాలన్నారు. భవనాల నిర్మాణ పనులకు సంబంధించి వారం వారం పనుల లక్ష్యాలను నిర్దేశించుకుని పూర్తిచేసి వారాంతరం నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. నిర్మాణ పనులకు చాలావరకు పూర్తి కావచ్చాయని పనులను మరింత వేగవంతం చేసి రూఫ్ లెవెల్ స్థాయి ఉన్న వాటిని ఫినిషింగ్ స్థాయికి తీసుకువచ్చి పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానికంగా పరిష్కారం కాని సమస్యలను తక్షణమే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ ఎస్ఈ, వి.వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు కృష్ణకిరణ్, సుధ, రమేష్, ఎస్.శివరామకృష్ణ, ఆర్.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

మహిళల గౌరవాన్ని పెంచే పింక్ టాయిలెట్స్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : మహిళల గౌరవాన్ని పెంచేవిధంగా నగరంలో వారి కోసం ప్రత్యేక పింక్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. స్థానిక బెంజ్‌సర్కిల్ వద్ద నిర్మించిన పింక్ టాయిలెట్లను మేయర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల కోసం మహిళలచే నిర్వహించేది ఈ పింక్ టాయిలెట్స్ అన్నారు. చాలామంది మహిళలు, మహిళా ఉద్యోగస్తులు, ప్రయాణికులు, కాలేజీ విద్యార్థినులు బెంజ్ సర్కిల్ మార్గం నుంచి రాకపోకలు సాగిస్తుంటారన్నారు. ఈ ప్రాంతంలో మహిళల కోసం ప్రత్యేకంగా ఒక టాయిలెట్ ఏర్పాటు చేయటం వల్ల వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారికి సౌకర్యంగా ఉండేలా మరుగుదొడ్లు, చేంజింగ్ రూమ్, పాలిచ్చే తల్లులకు ఫీడింగ్ రూమ్, సానిటరీ వెండింగ్ మెషిన్‌లో కేవలం రూ.5కే 3 శానిటరీ నాప్కిన్స్ వచ్చే సదుపాయం పింక్ టాయిలెట్స్ మహిళల కోసం ప్రత్యేకమని తెలిపారు. నవంబర్ 19న ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మరుగుదొడ్లు, వాటి వాడకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. వైసీపీ తూర్పు నియోజకవర్గం ఇంచార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేక టాయిలెట్ల ఏర్పాటు చేయటం మంచి ఆలోచనని, మహిళలు అందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని, బెంజ్ సర్కిల్ వంటి జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రదేశంలో ఇలాంటి టాయిలెట్లు నిర్మించడం చాల ఉపయోగమన్నారు. మేయర్ మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేకించి ఒక టాయిలెట్ని రూ.20 లక్షలతో నిర్మించటం, వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక గదులను కేటాయించటం జరిగిందన్నారు. ప్రజలంతా సహకరించి మరుగుదొడ్లను ఉపయోగించాలని బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గా, సబ్ కలెక్టర్ అదితిసింగ్, కార్పొరేటర్లు మహేశ్ వేగం, ప్రవల్లిక, నిర్మలకుమారి, అడిషనల్ కమిషనర్ సత్యవతి, సిఎంఓహెచ్ రత్నావళి, స్థెల్లా కళాశాల ఉపాధ్యాయులు స్వప్న పాల్గొన్నారు.

పంచాయతీలకు బోరు పంపులు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు మండల పరిధిలో ని అన్ని గ్రామ పంచాయతీల యందు 27 బోర్ పంపులకు రూ. 3.00 లక్షల అంచనా వేయం తో ఫ్లషింగ్ చెయ్యుట జరిగినది. సదరు పనులను మండల పరిషత్ అధ్యక్షులు ఎంపీపీ మార్కపూడి గాంధీ, ఆర్ ఎస్ డబ్ల్యు ఏ ఇ నరసింహారావు, పర్యవేక్షించారు.

అన్నదానంకు రూ.10 వేలు విరాళం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న తిరుపతమ్మ అమ్మవారి ఆలయం లో జరుగు అన్నదానం కు ఆంధ్ర ప్రదేశ్ గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం మండపాడు గ్రామం వాస్తవ్యులు చిగురుపాటి నాగభూషణం అమ్మవారి దేవస్థానం నిత్య అన్నదాన పథకమునకు పదివేల రూపాయలు విరాళంగా అందజేశారు. అమ్మవారి ఆలయ అర్చకులు వేద పండితులు ఆశీర్వచనం చేసి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేసినారు ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ జె ఎస్ వి ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం

విశాలాంధ్ర-గంపలగూడెం : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా 5వ రోజు శుక్రవారం నాడు పెనుగొలను శాఖ గ్రంథాలయం నందు కవి సమ్మేళనం ,సెమినార్లు, రచయితల సంతకం కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ శాఖ సమితి అధ్యక్షులు టి .ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. అనేకమంది కవులు రచనల ద్వారా సమాజం చైతన్య పరచాలని తెలుగు భాష సమితి అధ్యక్షులు తెలిపారు. వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థిని ,విద్యార్థులు, కవుల చిత్రపటాలు పట్టుకొని ప్రదర్శన నిర్వహించారు. తదుపరి సీనియర్స్ కు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు వి. నరసింహారావు ,వెంకటేశ్వర్లు ,అంజయ్య మరియు పాఠకులు ,గ్రంథాలయ నిర్వాహకులు జె .శ్రీలత పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన ఐక్యత రాగం

విశాలాంధ్ర-పెదపరుపూడి : తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ ఐక్యతతో మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ అనే కార్యక్రమంలో భాగంగా పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ వర్ల కుమార్ రాజా నాయకత్వంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుమార్ రాజా మాట్లాడుతూ రాబోయే రోజులలో తమ సహకారం అందించి ఆశీర్వదించాలని ప్రజలను అభ్యర్థిస్తూ రెండు చేతులు జోడిస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చలసాని నిరంజన్ చౌదరి, టీడీపీ విభాగం మండల శాఖ అధ్యక్షుడు గొరిపర్తి రవికుమార్, కూనపురెడ్డి సుబ్బయ్య, దూళ్ల జమ్మీబాబు, మద్దిరి అభిమన్యుడు టీడీపీ,జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవికి పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర-మోపిదేవి : మండల కేంద్రమైన మోపిదేవి గ్రామంలో స్వయంభుగా వేంచేసిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానమును నాగుల చవితి పర్వదినం పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. శుక్రవారం తెల్లవారుజామున 2. 30 నిమిషాలకు తొలి నాగపుట్ట పూజ నిర్వహించిన అనంతరం భక్తులను వదిలారు. తెల్లవారుజామున అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు నాగులచవితి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే రమేష్ బాబు దంపతులకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే ఆలయానికి విచ్చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు . నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తొలుత ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. నాగ పుట్ట పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు వేదమంత్రాలతో మంత్రం నడుమ నాగపుట్ట పూజ నిర్వహించి తొలిగా నాగపుట్టలో ఎమ్మెల్యే దంపతులు పాలు పోసి, పుట్ట వద్ద హారతి ఇచ్చారు. అనంతరం శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు, ఆలయ పండితులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు మరియు వారి కుటుంబ సభ్యులకు ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆలయ మర్యాదలతో సన్మానించారు. స్వామివారి చిత్రపటాన్ని స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. ఆలయ ప్రాంగణంలో దీపారాధన చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన లడ్డు కౌంటర్లను ప్రారంభించారు. మెడికల్ క్యాంపులను ఎమ్మెల్యే పరిశీలించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నాగుల చవితి సందర్భంగా ఉదయం 2.30 ని"ల నుంచి భక్తులు స్వామివారి దర్శనం చేసుకునేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 2 గంటల 30 నిమిషాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నాగుల చవితి సందర్భంగా ఆలయంలో నిర్వహించే ప్రత్యేక దర్శనాలు ఆలయ అధికారులు రద్దు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు 50 వేల మంది భక్తులు వరకు వచ్చారని దేవస్థానం అధికారులు తెలిపారు. దర్శనానికి వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసిన సహాయ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధి పోలీస్ శాఖ వారు నిర్వహించారు. మరియు రెవెన్యూ సిబ్బంది మెడికల్ సిబ్బంది పంచాయతీ వారు సెక్యూరిటీ సిబ్బంది 10 మంది విశ్వహిందూ పరిషత్తు కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు లింగం బసవ శంకరరావు మరియు సేవాసమితి వారు వారి సేవలు కొనసాగించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం విజయవాడ, గుడివాడ, మచిలీపట్నం డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఆర్టీసీ అధికారులు.. నడిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 8,000 మంది భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు. అవనిగడ్డ డి.ఎస్.పి మురళీధర్ ఆధ్వర్యంలో చల్లపల్లి సిఐ నాగప్రసాద్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. వివిధ దేవాలయాల నుంచి కూడా సిబ్బంది విధులు నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి నాగపుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. నాగుల చవితి సందర్భంగా పెద్ద సంఖ్యలో ఆలయానికి భక్తులు రావడంతో అందుకు తగ్గట్టుగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయటం విశేషం. అందరికీ అన్నదాన కార్యక్రమం కూడా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో నల్లం సూర్య చక్రధర రావు, ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.